# దుర్వాసుడు

-ఎం.సి. ఆంజనేయులు

మాధవరావుకు స్ట్రక్చరల్ ఇంజనీరింగ్‌లో ఎమ్.టెక్. (యమ-టెక్కు) డిగ్రీ వుంది. డిజైన్స్ విభాగంలో ఎక్జిక్యూటివ్ ఇంజనీరు (ఇ.ఇ.)గా విశేషమైన అనుభవం వుంది. ఎంతటి కష్టాతికష్టమైన డిజైన్ అయినా, కళ్ళు మూసుకొని పరిష్కరించగలడన్న మంచి పేరుంది. పేరు తెచ్చిపెట్టిన అహం, అహంతో పాటూ అబ్బిన అసహనం, అసహనానికి అలంకారప్రాయంగా అమరిన చిర్రుబుర్రులు ఆయనకు పుష్కలంగా వున్నాయ్. అందుకే ఆయన కింద పన్జేసే ఇంజనీర్లాయన్ని డి.యన్. (దుర్వాసముని) అని ప్రేమగా పిల్చుకుంటారు.

ముక్కుమీద వున్న కోపం అప్పుడప్పుడు ఆయన కింది ఉద్యోగులను ఉక్కిరిబిక్కిరి చేస్తే, ముక్కులోపల ఆయనకున్న 'రినైటస్' అనే నాసికా సంబంధమైన ఎలర్జీ-ఆయన్ని పదేపదే అతలాకుతలం చేస్తుంది.

ఆఫీసు నుండి ఇంటికి, ఇంటి నుండి ఆఫీసుకు కార్లో బయలుదేరాడంటే, రోడ్డు మీది దుమ్మూ-ధూళీ ముక్కుపుటాల్లో దూరి తనని బాధించకుండా ఉండేందుకు, ఓ తెల్లని జేబురుమాలను ముక్కుకు అతికించుకొని కూచుంటాడు. కారు డ్రైవరు అబ్దుల్లా కూడా రద్దీ తక్కువగా వుండే రోడ్ల మీద వాహనాన్ని నడిపి, అతి జాగ్రత్తగా ఆయన్ని గమ్యానికి చేరుస్తూ వుంటాడు.

ఆఫీసులో మాధవరావు వుంటున్న గది పక్క గదిలో నల్గురు డిప్యూటి ఎక్జిక్యూటివ్ ఇంజనీర్లు (డి.యి.యి.లు), ఆ గదికి ఆనుకొని వున్న పెద్ద హాల్లో, ఓ డజను అసిస్టెంట్ ఎక్జిక్యూటివ్ ఇంజనీర్లు (ఎ.యి.యి.లు), డ్రాఫ్ట్‌మన్లు, ట్రేసర్లు, మిగిలిన సిబ్బంది కూచుంటారు.

ఎప్పటిలా, ఆరోజు కూడా అందరూ ఎవరి పనుల్లో వాళ్ళు నిమగ్నులై వున్నారు.

మాధవరావ్ గదిలోంచి విన్పించిన కాలింగ్ బెల్ శబ్దానికి గది బయట కూచున్న అటెండర్ అప్పారావు లేచి అటెంషన్‌లో నుంచున్నాడు. మళ్ళీ రెండవమారు బెల్ మోగడంతో, ఇ.ఇ. గారి రూములోకి వెళ్ళి, తిరిగి బయటికి వచ్చి ఎ.యి.యి.లు కూచునే హాల్లోకి దూసుకపోయి, కొండారెడ్డి, ఎ.యి.యి. బల్ల ముందు నుంచున్నాడు.

కొండారెడ్డి ఈ మధ్యనే తిరుపతి నుండి బదిలీ మీద హైదరాబాద్ వచ్చి డిజైన్స్ విభాగంలో చేరాడు, చెడిపోయిన తన సి.ఆర్. (కాన్ఫిడెన్షియల్

---

## పరిణామం

ఒకనాడు
సకల జీవన వ్యవహారాలు
ఇచ్చి పుచ్చుకోవడమే ఆచారం
వైద్యం అందివ్వడం, విద్యనేర్పడంతో సహా
పాలు పెరుగు అమ్మడం కూడా అనాచారం
ఎపుడు పుట్టిందో వెండి నాణెం, కరెన్సీ నోట్
కాని
బతుకు విలువల్ని ధ్వంసం చేసింది
నేడు అమ్మకానికి సరుకు కానిదేది
పాలూ పెరుగే కాదు
ప్రకృతిచ్చిన పచ్చి మంచి నీళ్ళను కూడా
అమ్ముతున్నారు
నేలనైతే గుంట కింతలా, గజాని కింతలా
అమ్ముతూ
ఇక గాలిని కూడా ప్రచారమిచ్చి అమ్మతారు
ఉప్పు, పప్పు, బియ్యం, బెల్లం
పశువు, పక్షి, ఆడది, అందం, మనిషి
అంగాంగాలు
అన్నీ అమ్మకానికి సరుకే
క్రూరమైన బతుకు వ్యాపారంలో
దయ, కరుణ, కనికరం కరువై
మనిషి డబ్బుకు ఊడిగం చేస్తున్నాడు.

-సబ్బని లక్ష్మీనారాయణ

రిపోర్ట్), చక్క చేసుకుందామని.

"మిమ్మల్ని-సార్-పిలుస్తున్నారు!" అన్నాడు అటెండర్ అప్పారావు, కొండారెడ్డి కేసి చూస్తూ.

"నన్నా!" ఉలికిపాటుగా, తనే అధికారి అన్నంత దర్పంగా తన ఎదుట నిలబడి వున్న అప్పారావు వంక చూశాడు, కొండారెడ్డి.

మాధవరావ్ సర్వసాధారణంగా ఎ.యి.యి.లను చర్చలకు పిల్వడు. సంబంధిత డి.యి.యి.లనే కేకేస్తాడు.

"జెన్సార్! మిమ్మల్నే!" దబాయింపుగా అన్నాడు అప్పారావు. కొంచం నెర్వస్‌నెస్ ఫీలయిన కొండారెడ్డి- తన ఇమ్మీడియట్ బాస్ అయిన డి.యి.యి. ఏ.వీ.రావ్ వద్దకు వెళ్ళి, "ఇ.ఇ. గారు నన్నెందుకు రమ్మన్నారో?!" అన్నట్టు ముఖం పెట్టాడు.

"పర్వాలేదులే... వెళ్ళు కొండారెడ్డీ! ఇ.ఇ. గారు బహుశా నీ డ్రాయింగ్ చూస్తున్నారులా వుంది. అందులో ఆయనకేమైనా డవుట్స్ ఉన్నాయేమో?

---

**త్రికాలాలు**

**గ**త కాలాల పునాదుల,
వర్తమానాల నిర్మాణాలు,
భావికాలాల భాగ్యాలు!

**త్రిసంజలు**

**బా**ల్యంలో చదువుల బడి!
వయసులో వలపుల ఒడి!
ముదిమిలో మమతల గుడి!

**బర్త్‌డే**

**ఒ**క్కొక్క బర్త్‌డే
ఒక్కొక్క అడుగు
మృత్యు ముఖానికి
చేరువగా చేర్చేనని
తెలుసుకోలేని
కుర్రగాళ్ళ
తన్మయత్వాన
జన్మదినాల
వేడుకల్‌జరిపే
వెర్రివాళ్ళు!

–సోమంచి రామం

---

వెళ్ళి క్లియర్ చేసిరా..." మొదటిసారిగా ఇ.ఇ.ని ఎదుర్కోబోతున్న కొండారెడ్డి వంక జాలిగా చూస్తూ, ధైర్యవచనాలు పల్కాడు, ఏ.వీ.రావ్.

ఏ.వీ.రావ్ అందించిన అభయహస్తం అందుకొని మాధవరావ్ గదిలోకి నెమ్మది నెమ్మదిగా ప్రవేశించాడు, కొండారెడ్డి.

రివాల్వింగ్ చేర్‌లోంచి సగం లేచి, టేబిల్ మీదున్న డ్రాయింగ్ షీట్ స్టడీ చేస్తున్నాడు మాధవరావ్.

కాస్త భయంగా, కాస్త బెరుగ్గా నుంచున్నాడు, కొండారెడ్డి మాధవరావ్ ఎదురుగా.

తలెత్తి, తృణీకారంగా కొండారెడ్డి కేసి చూశాడు మాధవరావ్. అంతే-

కోపంతో కస్సుమన్నాడు-

ఓ పది నిముషాలు పేట్రేగిపోయాడు-

-నీకే యూనివర్శిటీ ఇచ్చిందయ్యా ఇంజనీరింగ్ డిగ్రీ అన్నాడు.

-ఒళ్ళు దగ్గర పెట్టుకొని డ్రాయింగ్ గీయాలయ్యా అన్నాడు.

-డ్రాయింగ్‌లో మిస్టేక్స్ కొల్లలుగా వున్నాయన్నాడు.

-అక్షరాల ప్రింటింగ్ అధ్వాన్నంగా-మరీ నర్సరీ పిల్లాడి రాతలా- వుందన్నాడు.

-డ్రాయింగులో చూపవలసిన చాలా డీటెయిల్స్ ఎగరకొట్టావన్నాడు.

-ఫైనల్‌గా, ఇదే ప్రథమం కాబట్టి క్షమిస్తున్నానన్నాడు. ఒకపక్క కేకలేస్తున్నా- ఇంకోపక్క నోటిని, ముక్కును, జేబురుమాలుతో కవర్ చేసుకుంటూనే వున్నాడు, మాధవరావు.

బ్లాస్టింగ్ అయిపోయాక, తను ముందే నోట్ చేసి వుంచిన తప్పుల పట్టికను, పేపర్ వెయిట్ కింద నుంచి లాగి, దాన్ని కొండారెడ్డి వైపు తోస్తూ, "ఊఁ. వెళ్ళు. ఏ.వీ.రావుకు చూపించు. రిమార్క్స్ ఒక్కటొక్కటి జాగ్రత్తగా చదివి, అర్థం చేసుకొని, డ్రాయింగ్ సరిదిద్ది పట్రా. అర్థమైంది కదా!" అంటూ, కుర్చీలోకి జారిపోయాడు, మాధవరావ్.

డ్రాయింగ్ షీట్ ఒక చేత్తో, రిమార్క్స్ కాగితం మరో చేత్తో పట్టుకొని ఖిన్నవదనంతో బయటపడ్డ కొండారెడ్డి తిన్నగా ఏ.వీ.రావ్ దగ్గరకు నడిచాడు జరిగిందంతా నివేదించేందుకు. ఆనక తన సీటు

వద్దకు వెళ్తూ, ఇ.ఇ. మాటలకు తన అసమ్మతి తెలియజేస్తూ, గొణుక్కున్న మాటలు, పక్క ఎ.యి.యి.లకు విన్పించనే విన్పించాయ్.

"ఎందుకలా బిగ్గరగా అరవడం! డి.ఎమ్. అనే నిక్ నేమ్- ఎవరు పెట్టారో కానీ, కరెక్టుగా పెట్టారు. కాస్త నెమ్మదిగా, శాంతంగా మాట్లాడొచ్చుగా..."

మూడ్రోజులు అట్టే గడిచిపోయాయ్.

ఇ.ఇ. సూచించిన తప్పులను సరిదిద్ది, మరికొన్ని వివరాలు కొత్తగా డ్రాయింగులో చూపించి, ప్రింటింగ్ సరిచేసి, డి.యి.యి.కి చూపించి, ఆయన చేత ఒ.కే. అన్పించుకొని, ఆమీదట డ్రాయింగ్ చేతపట్టుకొని, బాస్ గదిలోకి ప్రవేశించాడు, కొండారెడ్డి.

తెచ్చిన డ్రాయింగ్ షీట్‌ని టేబిల్ మీద పరిపించాడు మాధవరావ్. దాన్ని కళ్ళతో ఓమారు అమాంతం స్కాన్ చేశాడు. కళ్ళద్దాలను నొసల మీదికి జరిపి, ఎ.యి.యి. కేసి తీక్షణంగా చూశాడు.

"ఊఁ. అన్నీ సరి చేశావా?"

"ఎస్సర్."

"ఊఁ."

"ఎస్సర్."

"ఏవిటి-ఎస్సు. ఇటు చూడు. అదే తప్పు మళ్ళీ చేశావ్. ఇక్కడ చూడు- డైమెన్షన్ మిస్ చేసావ్. చీమల్లా వున్న ఈ డీటెయిల్స్ ఎవరికి కన్పిస్తాయయ్యా? నాకే కన్పించడం లేదు! కొంచెం బ్లో అప్ చేస్తే నీ సొమ్మేం పోతుంది... ఎప్పుడు నేర్చుకుంటావయ్యా?" ముఖం చిట్లించాడు బిగ్ బాస్.

"ఎస్సర్... ఎస్సర్..."

"ఏవింటి ఎస్సు! ఏమిటి... అబ్బ ఏమిటయ్యా ఆ కంపు. తలక్కానీ పర్ఫ్యూమ్ హేరాయిల్ రాసుకొచ్చావా కొంపదీసి. మై గాడ్... గెట్ లాస్ట్... బయటకు వెళ్ళిపో..."

భరించలేని ఏదో వాసన మాధవరావ్ ముక్కు పుటాలను తాకి ఉక్కిరిబిక్కిరి చేస్తూంటే, జేబురుమాలను ముక్కుకు అడ్డం పెట్టుకుంటూ బాత్‌రూం వేపు పరుగు తీశాడు మాధవరావ్.

కళ్ళల్లో తళతళలు నింపుకొని బాస్ రూం నుంచి బయటపట్టాడు కొండారెడ్డి.

డి.ఎమ్. కబంధ హస్తాల్లోంచి తప్పించుకొని అంత త్వరగా ఎలా బయటపడ్డాడో అర్థంకాక ఎ.యి.యి.లే కాదు- డి.యి.యి.లు కూడా నోళ్ళు వెళ్ళబెట్టారు.

వచ్చి తన సీట్లో విజయోత్సాహంతో కూచుంటున్న కొండారెడ్డి చుట్టూ మూగిపోయారు, సంభ్రమాశ్చర్యాలతో, ఎ.యి.యి.లందరూ. అందరి మొహాల్లోనూ అదే ప్రశ్న! "నిన్నెలా వదిలేశాడయ్యా బాసు- ఇంత త్వరగా!?"

సెంటు వాసనలు గుప్పిస్తున్న దూది పింజాన్ని కుడి చెవిలోంచి బయటకు తీసి, అందరికీ చూపిస్తూ, గర్వంగా బుజాలనెగురవేస్తూ, స్థిరంగా, గంభీరంగా అన్నాడు, కొండారెడ్డి.

"అలా తెల్ల ముఖాలేస్తారెందుకు? సెంటు పూసిన ఈ దూది పింజమే నా విజయానికి కారణం. థ్యాంక్స్ టు మిస్టర్ అబ్దుల్లా ద డ్రైవర్! బాస్ ఉపయోగించే తెల్లరుమాలు రహస్య ఛేదనలో అతని సహాయం ఎనలేనిది..."

"అబ్దుల్లా సహాయంవా...!" అందరూ ఒక్కమారు అరిచారు.

"ఎస్. అబ్దుల్లా సహాయమే. మొన్న లంచ్ ఇంటర్‌వల్‌లో క్యాంటీన్ కెళ్ళి వస్తున్నాను. ఆఫీసు బయట అత్తరు సాయిబు. అతని చుట్టూ, చిన్నా పెద్దా, చేరి ఎగబడి కొంటున్నారు. సెంట్ బాటిల్స్. మరి రంజాన్ పండుగ నెల కదా! పాపం, డ్రైవర్ అబ్దుల్లా, కారు దగ్గర ఏకాకిగా నిలబడి వేడుక చూస్తున్నాడు. అతన్ని సమీపించాను. "ఏం... సెంటు కొనుక్కోవా పండక్కి" అని అడిగాను.

"అమ్మో! ఇంకేమైనా వుందా? నా ఉద్యోగం ఊడిపోదూ! అయ్యగారికి అత్తరు వాసన అసలు పడదు..." అన్నాడు అదోలా ముఖం పెట్టి. ఆ క్షణాన తళుక్కుమంది ఈ ఐడియా నా బుర్రలో! నా విజయ రహస్యం అర్థమైంది కదూ!" కాలర్ పైకెత్తుతూ అన్నాడు, కొండారెడ్డి.

అంతే-

అత్తరు సాయిబు ఆఫీసు సముదాయాల చెంత అమ్మే ప్రత్యేకమైన ఆ సెంటు సీసాలకు ఆనాటి నుండి గిరాకీ పెరిగిపోయింది, ఆ డిజైన్స్ విభాగంలో కూడా. ■